సాక్షి
వికారాబాద్
ఆదివారం । 16 । జూలై । 2023



కాసులు కురిపిస్తున్న కార్గో

నష్టాలు, ఒడిదుడుకులతో ముందుకు సాగుతున్న ఆర్టీసీ సంస్థ కార్గో సేవలతో లాభాలను ఆర్జిస్తోంది. 8లో▸



భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

కొడంగల్‌లోని మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 8లో▸



నీకింత.. నాకెంత!

బీసీ చేతివృత్తుల వారికి రూ.లక్ష సహాయం లబ్ధిదారులకు అందించనుండటంతో దళారుల దందా జోరందుకుంది. 9లో▸

న్యూస్‌రీల్

ఖర్గేను కలిసిన రామ్మోహన్‌రెడ్డి



పరిగి: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఏఐసీసీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారన్నారు. జిల్లాలో పార్టీ పనితీరుపై ఆరా తీశారన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు గెలిచేలా కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారని చెప్పారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- ఎస్పీ కోటిరెడ్డి



ప్రయాణికులకు పోలీసుల అవగాహన

అనంతగిరి: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పలు టీంలు ఏర్పాటు చేసి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం ఆపరేషన్ స్మైల్ నిర్వహించి 118 మంది పిల్లలను కాపాడామన్నారు. చిన్నారులను పనిలో నియమించుకున్న 15 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే ఆపరేషన్ ముస్కాన్‌లో సైతం 58 మంది పిల్లలను కాపాడి, పనిలో పెట్టుకున్న వారిపైన కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆడపిల్లల సంరక్షణ కోసం జిల్లాలో షీటీం, భరోసా కేంద్రం, ఏహెచ్‌టీయూ టీంలు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. ఈ యేడాది ఏహెచ్‌టీయూ టీంలు 116 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


గొర్రెల పంపిణీకి త్వరగా గ్రౌండింగ్ చేపట్టాలి



పశువైద్యాధికారితో మాట్లాడుతున్న గొర్రెల కాపరుల సంఘం నాయకులు

పరిగి: రెండో విడత గొర్రెల పంపిణీకి గొల్ల కురుమలు అప్పులు చేసి డీడీలు చెల్లించారని, త్వరగా గ్రౌండింగ్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని షీప్ బ్రీడర్స్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు కోరారు. శనివారం షీప్ బ్రీడర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లబ్ధిదారులు ఒక్కో యూనిట్ కోసం రు.43, 750 అప్పులు చేసి చెల్లించారన్నారు. ప్రభుత్వం నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తోందని అన్నారు. వెంటనే గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాముయాదవ్, నరసింహులు, శ్రీశైలం, గోపాల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌లో సత్తాచాటిన పట్లోళ్ల



పట్లోళ్ల లింగారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 3 పతకాలు సాధించిన వికారాబాద్‌కు చెందిన పట్లోళ్ల లింగారెడ్డిని శనివారం ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో లింగారెడ్డికి శాలువాతో సన్మానించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు రాజమల్లు, కౌన్సిలర్ కృష్ణారెడ్డి, కడియాల వేణుగోపాల్, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు.

భక్తితో కొలిచి.. ప్రణమిల్లి..

శని త్రయోదశి, మాస శివరాత్రి పూజలు



అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

ధారూరు మండల కేంద్రంలోని వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి, మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన దుర్గామాతను విశేషంగా అలంకరించారు. భక్తులు ప్రథమ పూజ్యుడు గణపతిని ఆరాధించి తర్వాత అమ్మవారికి, కపిలేశ్వరస్వామికి పూజలు చేశారు. కపిలేశ్వరస్వామికి జలాభిషేకం, క్షీరాభిషేకం చేసి భక్తితో పూజించారు. పూజారులు భక్తులకు హారతి ఇచ్చి తీర్థ,ప్రసాదాలు అందజేశారు.

– ధారూరు



కపిలేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సర్వే లొల్లి!

శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తాండూరులో నిర్వహిస్తున్న సర్వేలు చిచ్చు రేపుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలనేకాకుండా ఎవరికి వారుగా సొంత సర్వేలు నిర్వహిస్తున్నారు. ఓ సంస్థ నిర్వహిస్తున్న సర్వే కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఆగ్రహం తెప్పిస్తోంది. పార్టీకి సంబంధం లేని నేతల పేర్లను అసెంబ్లీ అభ్యర్థులుగా సర్వే పత్రాలలో చేర్చి ప్రజల మధ్యకు వెళ్లడం రాజకీయ దుమారానికి కారణమవుతోంది.

- నియోజకవర్గంలో సంస్థ ఆరా
- ఊరూరా ప్రజల అభిప్రాయ సేకరణ
- ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లు మార్చిన వైనం
- సంస్థ ప్రతినిధులను నిలదీస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు




పెద్దేముల్‌లో సర్వే ప్రతినిధులను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు: నియోజకవర్గ రాజకీయాలు ఇటీవల రాష్ట్ర స్థాయిలో సంచలనాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఈసారి ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై ఓ సంస్థ సర్వే నిర్వహిస్తోంది. ఈ సర్వేలో అధికార పార్టీకి చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పేర్కొంది. మాజీ మంత్రి తనయుడు ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్ పేరును బీజేపీ అభ్యర్థిగా, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేరు పత్రాలలో పొందు పర్చి సర్వే నిర్వహిస్తున్నారు. పార్టీకి సంబంధం లేని నేతల పేర్లను పార్టీ అభ్యర్థులుగా పేర్కొంటూ సర్వే నిర్వహించడం హాట్ టాపిక్‌గా మారింది.

జంపింగ్‌ల కోసమేనా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తాండూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన పైలెట్ రోహిత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. ఈ సారి బీఆర్‌ఎస్ టికెట్ వస్తుందనే విషయమై అధిష్టానం స్పష్టత ఇవ్వలేదు. అయితే సర్వేలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేరు జాబితాలో చేర్చారు. గతంలో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేరు కాంగ్రెస్ అభ్యర్థిగా చేర్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడుతారనేది కొంత కాలంగా జోరుగా ప్రచారమవుతోంది. మరోవైపు మహేందర్‌రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పర్యటలలో ముందు వరుసలోనే ఉంటున్నారు. బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ప్రకటనలు చూస్తున్నారు. అంతే కాకుండా తనకే టికెట్ వస్తుందంటూ పలుమార్లు ప్రకటించారు. కానీ ఈ సర్వేలో మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పేర్కొనడంపై అనుమానాలకు తావిస్తోంది.



సర్వే పత్రంలో కాంగ్రెస్ అభ్యర్థిగా మహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా రమేశ్ మహరాజ్ పేర్లు

భగ్గుమంటున్న కాంగ్రెస్ శ్రేణులు

సర్వేలో భాగంగా 15 అంశాలతో కూడిన జాబితాతో ఓ సర్వే సంస్థ పెద్దేముల్ మండలానికి వెళ్లింది. మండల కేంద్రంలో సర్వే చేస్తున్న ప్రతినిధులను కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. వారి వద్ద ఉన్న సర్వే పత్రాలను పరిశీలించగా కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని పట్నం మహేందర్‌రెడ్డి పేరు ఉండటంతో సర్వే ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పార్టీ ముఖ్య నేతలను సమాచారం అందించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులే సర్వే చేయిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. సర్వే చేస్తున్న సంస్థపై ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమవుతున్నారు.

పెళ్లికి వెళ్లివచ్చే సరికి ఇల్లు గుల్ల



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

- బీరువా తాళం పగులగొట్టి రూ. 28 లక్షలు అపహరణ

తాండూరు టౌన్: బంధువుల పెళ్లికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడి బీరువాలోని రూ.28 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఆస్గారి మజీద్ సమీపంలో నివసిస్తున్న ఆర్టీఓ కన్సల్టెంట్ మహ్మద్ వాజీద్.. బంధువుల పెళ్లి నిమిత్తం శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉంచిన రూ. 28 లక్షలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. ఇటీవల కందనెల్లి సమీపంలోని తన ప్లాట్‌ను విక్రయించగా వచ్చిన నగదును బీరువాలో పెట్టి పెళ్లికి వెళ్లాడు. ఆ డబ్బు చోరీకి గురి కావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరించారు. బాధితుడు వాజీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్లు బదిలీ!

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న టి.కృష్ణమోహన్‌రెడ్డిని సీడీఎం జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో రామగుండం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న బి.సుమన్‌రావును నియమించింది. అదే విధంగా మీర్‌పేట్ కమిషనర్‌గా నాగారం మున్సిపాలిటీ కమిషనర్‌గా పని చేస్తున్న ఎ.వాణిని బదిలీ చేసింది. తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా పాల్వంచకు చెందిన సీహెచ్.శ్రీకాంత్‌ను నియమించింది. అదే విధంగా ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎండీ షబ్బీర్‌ను ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి బదిలీ చేసింది. అదే విధంగా పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.రవీందర్‌రెడ్డిని నియమించింది. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న సత్యనారాయణరెడ్డిని ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఇబ్రహీంపట్నం కమిషనర్ మహ్మద్ యూసఫ్‌ను జీహెచ్ఎంసీకి బదిలీ చేసింది. ఆయన స్థానంలో మిర్యాలగూడ మున్సి పల్ కమిషనర్ పి.రవీంద్రసాగర్‌ను నియమించింది

జీపీ భవన నిర్మాణాలు ఇక వేగిరం

- అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: జిల్లాకు మంజూరైన పంచాయతీ భవన నిర్మాణాల పనులను వేగిరం చేస్తామని, నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం పంచాయతీ భవన నిర్మాణాల పురోగతి, పారిశుద్ధ్యం, హరిత హారం తదితర అంశాలపై అదనపు కలెక్టర్లు, డీపీఓలు, డీఆర్‌డీఓలతో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన 269 గ్రామపంచాయతీ భవనాలకు 157 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఒక గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి అయిందన్నారు. ఇంకా 111 జీపీ భవన నిర్మాణాల పనులను గ్రౌండింగ్ చేయవలసి ఉందని తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జీపీ భవన నిర్మాణాలను వేగిరంచేయాలని ఆదేశించారు. హరితహారం కింద మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సందర్భంగా ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీపీఓ తరుణ్ కుమార్, డీఆర్‌డీఓ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పంపండి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ అర్బన్: రైస్ మిల్లర్లు తమ వద్ద ఉన్న యాసంగి, వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి వెంటనే పౌర సరఫరాల కార్పొరేషన్, ఎఫ్‌సీఐకి పంపాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు రోజూ మిల్లులను సందర్శించి ధాన్యాన్ని మిల్లంగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, మేనేజర్ విమల, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్ల ప్రెసిడెంట్ బాలేశ్వర్ గుప్తా, సెక్రటరీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తీర్పులను పరిశీలించాలి

- న్యాయశాస్త్రంపై పట్టు సాధించాలి
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శర్మ

నందిగామ: న్యాయశాస్త్ర విద్యార్థులు చట్టాలపై పూర్తి పట్టు సాధించాలని, అంతర్జాతీయ న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కేవీఎస్ శర్మ సూచించారు. సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీ లా కళాశాలలో న్యాయశాస్త్రం ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి కేవీఎస్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని సూచించారు. ఫస్టియర్ నుంచే ప్రతీ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ గుజరాత్ డైరెక్టర్ సంపత్, కళాశాల డైరెక్టర్ సంతోష్ ఆగావ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రానిది కక్ష సాధింపు



చేవెళ్లలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, మహేశ్‌రెడ్డి, ఆనంద్ తదితరులు

- పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునే కుట్ర
- పర్యావరణ అనుమతుల ఫైల్‌ను తిరస్కరించడం అన్యాయం
- ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి మండిపాటు
- బీజేపీ, కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యేలు


చేవెళ్ల:పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కేంద్రం అనుమతులు నిరాకరించడం తెలంగాణ పై కక్ష సాధింపులో భాగమేనని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల, పరిగి, వికారాబాద్ ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, మహేశ్ రెడ్డి, ఆనంద్‌లతో కలిసి శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టుకోసం ఏర్పాటు చేసిన కమిటీ పర్యావరణ అనుమతుల కోసం పంపిన రిపోర్ట్‌ను కేంద్రం తిరస్కరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగితే ఇవ్వలేదని.. ప్రస్తుతం పాలమూరు ఎత్తిపోతలకు పర్మిషన్ ఇవ్వకుండా అడ్డుకుంటోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.రాష్ట్ర నిధులతో పనులు చేసుకుంటామని చెబుతున్నా.. సహకరించకపోవడం రాజకీయ కుట్ర అని ధ్వజమెత్తారు.ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని అప్పట్లో సుష్మాస్వరాజ్ చెప్పారని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌ల నుంచి సైతం అనుమతులు ఇస్తూ.. పాలమూరుపై వంకలు పెట్టడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఉద్దండపూర్‌లో 90శాతం పూర్తయ్యాయని వివరించారు. పార్లమెంట్‌లో తాము రాష్ట్ర ప్రయోజనాలకోసం పోరాడుతుంటే కాంగ్రెస్, బీజేపీ కలిసి రావడం లేదని ఆరోపించారు.

బీజేపీ, కాంగ్రెస్సే కారణం

పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు జాప్యానికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలే కారణమని ఎమ్మె ల్యేలు యాదయ్య, ఆనంద్, మహేశ్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో, జిల్లాలో రైతులు బాగుపడటం వీరికి రుచించడం లేదని తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి కాంగ్రెస్ నాయకులు కేసులు వేస్తూ అడ్డుకోగా.. పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా బీజేపీ ఇబ్బంది పెడుతోందని తెలిపారు. ఆ రెండు పార్టీలకు రైతులు, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జాతీయ స్థాయిలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మాలతి, నాయకులు ప్రభాకర్, రమణారెడ్డి, మహేందర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా డీ వార్మింగ్ డే

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వాన్‌కుమార్
- వైద్యాధికారులకు, సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పాల్వాన్‌కుమార్

అనంతగిరి: డీ వార్మింగ్ డే, మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వాన్‌కుమార్ తెలిపారు. వికారాబాద్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శనివారం వైద్యాధికారులకు, సూపర్‌వైజర్లకు, డీ వార్మింగ్ డే, మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ నేషనల్ వార్మింగ్ ప్రోగ్రాంలో 1–19 ఏళ్ల పిల్లలందరికీ నట్టల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రవేట్ స్కూళ్లలో, జూనియర్ కళాశాలలు, మదర్సాలలో, ఆశ్రమ పాఠశాలలో ఈనెల 20న వేయాల్సి ఉంటుందన్నారు. ఆరోజు వేసుకోనివారికి ఈనెల 27న వేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేయాలన్నారు. మిషన్ ఇంద్రధనుసు కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు ఇవ్వడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో మూడు విడతలుగా చేపడతారని తెలిపారు. మొదటి విడతా ఆగస్టు 7–12 వరకు, రెండో విడత సెప్టెంబర్ 11–16వరకు, మూడో విడత అక్టోబర్ 9–14వరకు ఉంటుందన్నారు. కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ మురారీ, పీఓ డాక్టర్ జీవరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ జీపులో బ్యాగ్ చోరీ



ఆర్టీసీ అధికారుల జీపు

తాండూరు టౌన్: ఆర్టీసీ అధికారులకు సంబంధించిన జీపు అద్దాలు పగులగొట్టి అందులోని బ్యాగ్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం ఆర్టీసీకి చెందిన తనిఖీ అధికారుల బృందం విధుల్లో భాగంగా శుక్రవారం తాండూరుకు వచ్చారు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో బస్టాండు వద్ద జీపునకు తాళం వేసి భోజనానికి వెళ్లారు. వచ్చే సరికి వెనుక అద్దం పగులగొట్టి అందులోని బ్యాగును దొంగలు ఎత్తుకెళ్లారు. బ్యాగ్‌లో చెకింగ్‌కు సంబంధించిన రశీదు బుక్కులు, గుర్తింపు కార్డు, పాన్, ఆధార్ కార్డులు, సీ బుక్ ఉన్నట్లు టీటీఐ రఘునాథ్ తెలిపారు. చోరీ విషయమై తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతగిరి: విద్యావ్యవస్థలో మార్పు కోసం ఏబీవీపీ తలపెట్టిన మహా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ నవీన్ కోరారు. ఆగస్టు 1న ఏబీవీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టబోయే సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం వికారాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అనేక ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదన్నారు. తొమ్మిదేళ్లుగా విద్యారంగం కుంటుపడిందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు హరీష్, భానుప్రసాద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేకల మృతి



కుక్కల దాడిలో చనిపోయిన మేకలు

మర్పల్లి: మేకలపై వీధి కుక్కలు దాడి చేయడంతో మూడు జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని కోట్‌మర్పల్లి శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాములు రోజు మాదిరిగా తన మేకలను పొలం వద్ద మేతకు వదిలాడు. మధ్యాహ్నం వాటిపై వీధికుక్కలు దాడి చేసి చంపేశాయి. అక్కడే ఉన్న రాములు కుక్కలపై రాళ్లతో దాడి చేసినా ఫలితం లేకపోయింది. మేకల విలువ రూ. 45 వేలు ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

యాలాల: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న మూడు ట్రాక్టర్లను యాలాల పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోకట్ కాగ్నా నది నుంచి మూడు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాల యజమానులను తహసీల్దార్ గోవిందమ్మ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాసులు కురిపిస్తున్న కార్గో



పరిగి ఆర్టీసీ బస్టాండ్‌లోని లాజిస్టిక్ బుకింగ్ కార్యాలయం

పరిగి: నష్టాలు, ఒడిదుకుల మధ్య ముందుకు సాగుతున్న ఆర్టీసీకి కార్గో సర్వీస్ బూస్టినిచ్చింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ప్రజా రవాణ సంస్థ.. ప్రస్తుతం కార్గో సేవలతో లాభాలను ఆర్జిస్తోంది. ఆర్టీసీని నష్టాల్లో నుంచి గట్టెక్కించేందుకు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మంచి ఆదాయ వనరుగా మారిందనే చెప్పవచ్చు. 2020 జూన్ 19న ప్రారంభమైన ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు మూడేళ్లు పూర్తి చేసుకొని అనతికాలంలో మంచి లాభాలు తెచ్చిపెడుతోంది.

ఉపాధినిస్తూ.. విస్తృతం చేస్తూ..

కార్గో సేవలను అన్ని ప్రధాన స్టాపుల్లో విస్తరించడంతో పాటు సర్వీస్ ఏజెంట్లను నియమించారు. కమీషన్ ప్రాతిపదికన ప్రైవేటు ఏజెంట్లను నియమించారు. లాజిస్టిక్స్ కమీషన్ ఏజెంట్లకు పార్సిల్ బుకింగ్స్ మీద 12శాతం, పార్సిల్ రిసీవింగ్ మీద ఒక్కొక్క దానిపై పది రూపాయల కమీషన్ చెల్లిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సేవలు అందుతుండడంతో పాటు పలువురు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. కమీషన్ ఏజెంట్లు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పార్సిల్స్‌ను వినియోగదారులకు అందజేయడం, తమ ప్రాంతాల నుంచి పార్సిళ్లను బుక్ చేయడం ద్వారా రెండు రకాలుగా ఆదాయం పొందుతున్నారు. పరిగి ఆర్టీసీ డిపో పరిధిలో 8 లాజిస్టిక్స్ ఏజెన్సీలు ఉన్నాయి. పరిగి, కుల్కచర్ల, గుర్మిట్కల్, బొంరాస్‌పేట్, దోమ, నంచర్లగేట్, ముదేల్, యాద్గిర్‌లో బుకింగ్ కార్యాలయాలు ఉన్నాయి.

మంచి ఆదాయం

లాజిస్టిక్స్ ద్వారా అందిస్తున్న సేవలతో ఆదాయం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. వందల సంఖ్యలో బుకింగ్స్ జరుగుతుండగా లక్షల్లో ఆదాయం వస్తోంది. నగరం నుంచి నిత్యం ఏదో ఒక వస్తువు కొనుగోలు చేస్తుండడంతో నిత్యం వందల సంఖ్యలో పార్సిల్స్‌ను ఆర్టీసీ కార్గో ద్వారానే ప్రజలు చేరవేస్తున్నారు. దీంతో గతం కంటే ప్రస్తుతం ఆదాయం పెరుగుతూ పోతోంది. కార్గో సర్వీస్ ప్రారంభించిన నాటి నుంచి పరిగి డిపోకు రూ. 20లక్షల వరకు ఆదాయం వచ్చింది.

కాలానుగుణంగా నూతన సేవలు

ఆర్టీసీ కార్గో ద్వారా పార్సిళ్లు, సరుకు రవాణా చేయడమే కాకుండా ప్రజలను ఆకట్టుకునేలా వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టడం, రాయితీలు ప్రకటించడం, ప్రత్యేక సందర్భాల్లో పలు ఆఫర్లు ఇవ్వడం, ప్రజల అవసరాలకనుగుణంగా సేవలను అందించడం ద్వారా మంచి ఆదాయం వస్తోంది. మేడారం మొక్కులు పంపిణీ కార్యక్రమం ఆర్టీసీ కార్గో చేపట్టింది. అమ్మవార్లకు బంగారం (బెల్లం) సమర్పించడానికి కార్గో కౌంటర్ల ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించలేని, భద్రాచలానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం రాములోరి తలంబ్రాలను భక్తులకు అందజేశారు. రూ.116 చెల్లిస్తే తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చారు. ఇలా కాలానుగుణంగా ప్రజలకు సేవలందిస్తూ కార్గో ద్వారా ఆర్టీసీకి ఆదాయం సమకూరుతోంది.

అందుబాటు ధరల్లో

ఆర్టీసీలో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. వారికి అందుబాటు ధరల్లో కార్గో సేవలను అందజేస్తే పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుందనే ఆలోచనతో అధికారులు తక్కువ చార్జీలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్గో తక్కువ ధరలకు అందిస్తున్న సేవలపై విస్తృతంగా ప్రచారం చేశారు. అంతేకాకుండా వేగంగా పార్సిల్స్ అందుతుండడంతో వినియోగదారులు లాజిస్టిక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు.

త్వరగా పార్సిల్స్



కార్గో ద్వారా పార్సిల్స్ త్వరగా వస్తున్నాయి. ప్రైవేటు కార్గోల ద్వారా పార్సిల్స్ ఆలస్యం అవుతున్నాయి. దీంతో కొంత ఇబ్బందిగా ఉంది. కానీ ఆర్టీసీ కార్గోలో త్వరగా రావడంతో పాటు తక్కువ ఖర్చుతో వస్తువులు ఇంటికి సురక్షితంగా చేరుతుండడం బాగుంది.

– దస్తయ్య, పాలేపల్లి

విస్తృతం చేస్తాం



కార్గో సేవలు ప్రతి గ్రామానికి అందేలా కృషి చేస్తాం. నూతనంగా లాజిస్టిక్ ఏజెన్సీలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం పరిగి డిపోలో ఉండడంతో మండలాల వారికి ఏర్పాటు చేస్తాం. దీంతో గ్రామాలకు కూడా ఆర్టీసీ కార్గో సేవలను అందే అవకాశం ఉంది.

– పవిత్ర, ఆర్టీసీ డీఎం, పరిగి



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

- వేదమంత్రోచ్చారణలతో హోమాలు
- పులకించిన భక్తజనం

కొడంగల్: పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో వెలిసిన పరమ పావన నిలయం పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రోజు పవిత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిత్య కైంకర్యాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అపవిత్ర హరణం.. పవిత్రోత్సవం అంటూ అర్చకులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన 11 మంది అర్చకులు వేద మంత్రోచ్చారణలతో హోమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి దంపతులు, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ దంపతులు, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి పవిత్రోత్సవాల్లో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. టీటీడీ వైఖానస ఆగమశాస్త్ర సలహాదారు దివంగత సుందర వరద భట్టాచార్యుల కుమారుల ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా తెప్పించిన పవిత్ర మాలలను దేవేరుల సమేత మలయప్ప స్వామికి అలంకరించారు. మూలవిరాట్టుతో పాటు ఆలయంలో ఉన్న దేవతామూర్తులకు పవిత్ర మాలలను అలంకరించారు. శనివారం రాత్రి 7నుంచి 9గంటల వరకు పవిత్రోత్సవ మహా పూర్ణాహుతి, కుంభ బింబ ప్రదక్షిణం, ప్రోక్షణ, అక్షతారోపణం, అర్చక బహుమానం, తీర్థ ప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగిశాయి.



యజ్ఞ ద్రవ్యాలకు మొక్కుతున్న భక్తులు

ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్

ధారూరు: పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేశ్ అన్నారు. మండలంలోని కుక్కింద ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ చేయడం నేరమన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌ను ర్యాగింగ్ చేస్తే హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ లేదా తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే 6 నెలల జైలు, రూ. 1,000 జరిమానా విధించనున్నట్లు తెలిపారు. మహిళలు, పిల్లలు హింసకు గురైతే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ డిప్యూటీ న్యాయవాది పి.రాము, హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



శ్రీనివాస్(ఫైల్)



పాండు(ఫైల్)



మాణిక్యం(ఫైల్)

అనంతగిరి: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన సంఘటన వికారాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నవాబ్‌పేట మండలం మమ్మదాన్‌పల్లికి చెందిన మాణిక్యం(22) అతని స్నేహితుడు అజయ్‌ను స్వగ్రామం గుడుపల్లిలో దింపడానికి బైక్‌పై శుక్రవారం రాత్రి వికారాబాద్ వైపు వస్తున్నారు. ఇదే సమయంలో పట్టణంలోని అనంతగిరిపల్లికి చెందిన చాకలి పాండు(36) వికారాబాద్ నుంచి అటుగా బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాత్రి బంగారు మైసమ్మ ఆలయం వద్ద ఎదురెదురుగా వచ్చిన బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మాణిక్యం, పాండు, అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మాణిక్యం మృతి చెందాడు. చాకలి పాండు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అజయ్ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

పరిగి: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన తుంకుల్‌గడ్డ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పరిగి పట్టణానికి చెందిన కొమ్ము శ్రీనివాస్(19), గణేష్, అంజద్ బైక్‌పై లక్నాపూర్ నుంచి పరిగికి వస్తుండగా తుంకుల్‌గడ్డ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ధారాసింగ్ తదితరులు

పీసీసీ కార్యదర్శి ధారాసింగ్

తాండూరు రూరల్: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమ, అభివృద్ధి సాధ్యమని పీసీసీ కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. తాండూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ తరఫున శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పోయిందన్నారు. నెలనెలా జీతాలు ఇచ్చే పరిస్థితిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం లేదన్నారు. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని ఆయన కోరారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, కార్మిక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, నర్సింలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వికారాబాద్ డీఎస్పీగా నరసింహులు



ఏఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

అనంతగిరి: వికారాబాద్ డీఎస్పీగా కోనం నరసింహులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సత్యనారాయణ ఏఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. ఇంటలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న నరసింహులు వికారాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏఎస్పీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కొడంగల్ రూరల్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాములు నిందితుడి వివరాలు వెల్లడించారు. మండలంలోని రావులపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం సాయంత్రం ఎస్‌ఐ రవిగౌడ్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. తాండూర్‌కు చెందిన మహిబూబ్ కర్ణాటక రాష్ట్రం చందాపూర్ నుంచి 650 గ్రాముల గంజాయిని తన ఆటోలో తెస్తున్నాడు. తనిఖీల్లో గంజాయి బయటపడడంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములు

‘గృహలక్ష్మి’కి రూ.3 లక్షలు

- జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం తీసుకొస్తున్న గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సూచించారు. ఈ మేరకు శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో 'స్థాయీ సంఘాల సమావేశం' నిర్వహించారు. సొంత స్థలం ఉన్న వారికి ఈ పథకం కింద ప్రభుత్వం రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. ఆరోగ్య మహిళా పథకం ద్వారా పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి మహిళకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా.. లేదా..? అని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహిళల ఆరోగ్యంపై విధిగా శ్రద్ధ వహించాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం తగ్గడానికి కారణాలను అన్వేషించి, మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంతోపాటు తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నారు. దీన్ని రైతులకు అందజేయాలని సూచించారు. హరితహారానికి సరిపడా మొక్కలు ఉన్నాయా..? అని గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను అడిగారు. ప్రతీ ఇంటికి ఆరు మొక్కల చొప్పున ఇచ్చేందుకు అవెన్యూ ప్లాంటేషన్ చేయడానికి అన్ని మొక్కలు రెడీగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీలు వెంకట్రాంరెడ్డి, జంగమ్మ, మహిపాల్, దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

సీఎం సహకారంతోనే అభివృద్ధి

- మంత్రి సబితారెడ్డి
- రూ.4.26 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- బడంగ్‌పేట్ ప్లే గ్రౌండ్‌కు అమరవీరుడు సిరిపురం యాదయ్య పేరు

బడంగ్‌పేట్: సీఎం కేసీఆర్ సహకారంతోనే మహేశ్వరం నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడతో పాటు పలు డివిజన్లలో రూ.4.26 కోట్లతో చేపట్టిన పైప్‌లైన్, సీసీ, బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. బడంగ్‌పేటలో నిర్మించిన ప్లే గ్రౌండ్‌కు.. మలిదశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన సిరిపురం యాదయ్య పేరు పెట్టారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహేశ్వరం పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్లకు రూ.50 కోట్ల చొప్పున రూ.100 కోట్లు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున రూ.50 కోట్ల నిధులు కేటాయించారని గుర్తుచేశారు. ఈ నిధులతో ఆయా మున్సిపాలిటీల్లో అవసరమైన పనులు చేపడుతున్నామని స్పష్టంచేశారు. మహేశ్వరం నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ, సబ్ స్టేషన్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నియోజకవర్గం తరఫున మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బడంగ్‌పేటలో బోనాల పండుగ జరుపుకొంటున్న ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, అర్జున్, శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ అధికారులు, నాయకులు జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, జంగారెడ్డి, కాలనీల మహిళలు పాల్గొన్నారు.



గుర్రంగూడలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి



మోమిన్‌పేట: చంద్రాయన్‌పల్లిలో బోనమెత్తిన మహిళలు

బోనాల సందడి షురూ..

మోమిన్‌పేట: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో అమ్మవారి జాతరలో భాగంగా బోనాలు నిర్వహించారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలతో మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజయ్య, ఉప సర్పంచు వెంకట్‌రెడ్డి, నాయకులు శేఖర్, రాంలు పాల్గొన్నారు.

జిల్లాలో బోనాల ఉత్సవాల సందడి శనివారం ఉదయం నుంచే ప్రారంభమైంది. వేడుకలకు ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. ఆదివారం బోనాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్ని చోట్ల శనివారం సాయంత్రం బోనాలు ఊరేగింపు నిర్వహించారు.

పాఠశాలలో..

అనంతగిరి: పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని లిటిల్ లిల్లీ స్కూల్ కరస్పాండెంట్ బస్వరాజు గౌడ్ అన్నారు. శనివారం పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ఊరేగింపు

దోమ: మండలంలోని ఉదన్‌రావుపల్లి పెద్ద చెరువు సమీపం వద్ద కట్టమైసమ్మ నూతన విగ్రహ ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. శనివారం గ్రామ సర్పంచ్ రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ లక్ష్మయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ భీంసేన్, మాజీ చైర్మన్ గొల్ల శ్రీనివాస్, డైరెక్టర్లు హన్మంతు, పెంటయ్య, గ్రామ నాయకులు బుచ్చయ్య, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: బోనాలతో చిన్నారులు



దోమ: కట్టమైసమ్మ విగ్రహ ఊరేగింపులో భక్తులు